

మెదక్‌లో ప్రశాంతత

- ఇరువర్గాల ఘర్షణ కేసులో 27 మంది అరెస్టు
- రెచ్చగొట్టే తప్పుడు పోస్టుల పెడితే చర్యలు
- మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి



మెదక్ అర్బన్, జూన్ 18: మెదక్ పట్టణంలో ప్రశాంత వాతావరణం నెలకొందని జిల్లా ఎస్పీ బాలస్వామి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలు అదుపులోకి వచ్చాయన్నారు. అల్లర్లకు కారణమైన 27మందిని అరెస్టు చేశామన్నారు. ఇందులో ఓ వర్గానికి చెందిన 16 మంది, మరో వర్గానికి చెందిన 11 మంది ఉన్నారన్నారు. వారందరినీ రిమాండ్‌కు తరలించామన్నారు. మెదక్ జిల్లాతో పాటు ఇతర జిల్లాను నుంచి పోలీసు బలగాలతో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. సోషల్‌మీడియాపై నిఘా పెట్టామన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే తప్పుడు పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఘటన జరిగిన సమయంలో అన్ని వీడియోలు ఉన్నాయని, వాటి ఆధారంగా నిందితులను గురిస్తున్నామన్నారు. గొడవలపై సమగ్ర విచారణ చేపట్టామని, కారణమైన ఎవరిని వదిలేదిలేదన్నారు. చట్టాన్ని ఎవరూ కూడా తమ చేతుల్లోకి తీసుకోవద్దని ఈ సందర్భంగా ఎస్పీ బాలస్వామి సూచించారు.

అల్లర్లకు పోలీసుల వైఫల్యమే కారణం

- చేతకాకుంటే సెలవుపై వెళ్లండి
- ఎంపీ రఘునందన్‌రావు



మెదక్‌లో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, జూన్ 18: మెదక్‌లో జరిగిన అల్లర్లకు పోలీసుల వైఫల్యమే కారణమని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన పోలీసులను సస్పెండ్ చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. అల్లర్ల ఘటనలో అరెస్టు అయిన బీజేపీ, బీజేవైఎం, ఇతర నేతలను మంగళవారం మెదక్ సబ్‌జైలులో ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో హిందువులకు ఒక నీతి, ముస్లింలకు ఒక నీతి అన్నట్లు పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తాను ఎవరికీ భయపడనని తెలిపారు. జరుగుతున్న పరిమాణాల పట్ల పోలీసులను అప్రమత్తం చేసినా పట్టించుకోకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. మహిళా ఏఎస్‌ఐని దుర్భాషలాడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, కనీసం కేసు కూడా నమోదు చేయలేని దుస్థితిలో పోలీసు యంత్రాంగం ఉన్నదని దుయ్యబట్టారు. చట్టం ముందు అందరూ సమానమేనని, చట్టాన్ని పోలీసులు గౌరవించడం లేదన్నారు. ఎవరిమెప్పుల కోసమో.. పోస్టింగ్‌ల కోసమో, ఎవరిని కాపాడుకోవడం కోసమో కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని ఆరోపించారు. పోలీసు అధికారులు సరిగా డ్యూటీ చేసే చేతకాకపోతే సెలవు తీసుకొని వెళ్లాలని సూచించారు. అల్లర్లకు కారణమైన వ్యక్తికి ఎక్కడ గాయమైందని, ఆయనను ప్రభుత్వ ఆసుపత్రికి ఎందుకు పంపలేదని, ప్రైవేటు హాస్పిటల్‌లో ఎందుకు ఉంచారని పోలీసులు ప్రశ్నించారు. అతడిని వెంటనే అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపాలని, చేతకాకపోతే యూనిఫాం వేసుకోవడం మానేయాలన్నారు. ఐజీ రంగనాథ్ కరీంనగర్, వరంగల్‌లో ఎక్కువ ఉత్సాహం చూపించి బీజేపీ చేతిలో భంగపడ్డారని గుర్తుచేశారు. 14 మందిని పట్టుకొచ్చి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గంటల పాటు కూర్చోబెట్టి, ఆధార్ కార్డులు తీసుకురమ్మని బెదిరింపులకు పట్టణ సీఐ గురిచేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే వారిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కొందరి మాటలు విని ఫోన్ ట్యాపింగ్‌లో పట్టుబడ్డ కొందరు పోలీసులు ఇప్పుడు జైల్లో ఉన్నారని, అదే గతి మెదక్ అల్లర్ల ఘటన పోలీసులకు కూడా పడుతుందన్నారు. అనంతరం ఎంపీ రఘునందన్‌రావు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ బాలస్వామితో సమావేశమయ్యారు. దాదాపు 40 నిమిషాలపాటు ఎస్పీతోపాటు ఇతర అధికారులతో మాట్లాడారు. బయటకు రాగానే తమ పిల్లలను అక్రమంగా అరెస్టు చేసి, ఫోన్లను లాక్కొన్నారని బాధితుల తల్లిదండ్రులు ఎంపీ దృష్టి తెచ్చారు. విచారణ జరిపి న్యాయం చేయాలని అక్కడే ఉన్న మెదక్ డీఎస్పీ రాజేష్‌ను కోరారు.



బాలసదనంలో ఓ చిన్నారిని ఎత్తుకుని లాలిస్తున్న కలెక్టర్

అమ్మలాంటి ఆదరణ

సంగారెడ్డి రూరల్, జూన్ 18: సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి కొద్దిసేపు అమ్మలా ఓ చిన్నారిని లాలించారు. మంగళవారం ఆమె బాలసదనం, శిశుగృహ, సఖీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా బాలసదనం విద్యార్థులతో మాట్లాడారు. ఓ చిన్నారిని ఎత్తుకుని లాలించారు. అనంతరం మాట్లాడుతూ బాలసదనం, శిశుగృహాల్లో ఉన్న బాలలు మంచిగా చదువుకుని ఉన్నతస్థానానికి చేరుకోవాలని సూచించారు. బాలసదనం, వృద్ధాశ్రమ భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శిశుగృహలో ఉన్న పిల్లలు దత్తతకు తొందరగా వెళ్లేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి, సీడీపీవో రత్నం, డా. చక్రపాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సంగారెడ్డి డీఈవో కార్యాలయంలో ఎస్జీటీల సర్వీస్ బుక్‌లు పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

నేడు ఎస్‌ఏ టీచర్ల తుది సీనియారిటీ జాబితా !

- వెబ్ ఆప్షన్ల నమోదు కూడా చేపట్టే అవకాశం

సంగారెడ్డి అర్బన్, జూన్ 18: ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియ మళ్లీ నెమ్మదిగా ప్రారంభమైంది. జడ్పీ యాజమాన్య పరిధిలోని స్కూల్ అసిస్టెంట్ బదిలీలకు సంబంధించి ఆన్‌లైన్ అప్లికేషన్ల అప్‌డేషన్ ప్రక్రియ నిర్వహించారు. బుధవారం తుది సీనియారిటీ జాబితా విడుదల చేసి వెబ్ ఆప్షన్ల నమోదు చేపట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఎస్జీటీలకు గతంలో ఎన్ని సార్లు పదోన్నతి వచ్చింది, ఎన్ని సార్లు పదోన్నతి వదులుకున్నారు. ఆ విషయాన్ని సర్వీస్ బుక్‌లో అప్‌డేట్ చేయించుకునే ప్రక్రియను అధికారులు చేపట్టారు.

వాన చేటు.. మొలక లేటు..!

- దంచికొడుకున్న ఎండలు
- మొలిచిన మొక్కలూ ఎండు ముఖం
- వర్షం కోసం రైతన్న ఎదురుచూపులు

మునిపల్లి/కంది, జూన్ 18: సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఈ సీజన్‌లో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువే కురిసింది. సంగారెడ్డి జిల్లాలో సగటున 67.6 మీ.మీల వర్షం కురియాల్సి ఉండగా, దాదాపు రెట్టింపు స్థాయిలో 110.0 మీ.మీల వర్షం కురిసింది. మొత్తం 28 మండలాలు ఉండగా, 21 మండలాల్లో సాధారణం కన్నా ఎక్కువగా, రెండు మండలాల్లో సాధారణ స్థాయి వర్షాలు పడ్డాయి. మిగిలిన అయిదు మండలాల పరిస్థితి మాత్రం దారుణంగా ఉంది. మెదక్ జిల్లాలో జూన్‌లో 68.7 మీ.మీల సాధారణ వర్షపాతం కురవాల్సి ఉండగా, 86.4 మీ.మీల వర్షం కురిసింది. కానీ, జూలైలో వర్షాలు ముఖం చాటేయడంతో రైతులు మొగులు కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. తొలకరి జల్లులకు పత్తి నాటిన కొందరు రైతులు రోజులు గడుస్తున్నా వాన చినుకు జాడలేక దిక్కుతోచకున్నారు. వర్షాలను అధిగమించి పత్తి సాగు చేసినా నాసిరకం విత్తనాలు, పురుగుమందులు పత్తి రైతులను దెబ్బ తీస్తున్నాయి.



ఎండలోనూ పత్తి విత్తనాలను వేస్తున్న కూలీలు

వాడుతున్న మొక్కలు

ఇటీవల కురిసిన తొలకరి జల్లులకు ఆశలు చిగురించి పత్తి నాటిన రైతులు ఇప్పుడు వర్షాలు లేక.. భూమిలోనే పత్తి గింజలు ఎండిపోతుండటంతో ఆందోళన చెందుతున్నారు. వర్షాలు లేక కొన్ని చోట్ల మొలకలు రాకపోగా, మరికొన్ని చోట్ల మొలకెత్తిన మొక్కలు సైతం దంచికొడుతున్న ఎండలకు వాడు ముఖం పడుతున్నాయి. మునిపల్లి మండలంలో 35,425 ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ముందుగా నాటిన విత్తనాలు మొలకెత్తక పోవడంతో రైతులు మళ్లీ విత్తనాలు నాటాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కంది గ్రామ శివారులో పత్తి విత్తనాలను వేస్తున్న రైతులు

నాసివిత్తనాల తంటా..

అష్టకష్టాలు పడి పత్తి పండిద్దామనుకునే రైతులకు నాసిరకం విత్తనాలు పట్టి పీడిస్తున్నాయి. కంది మండలంలో సుమారుగా 17,817 ఎకరాల సాగు భూమి ఉన్నది. ఇందులో వరి, పత్తి ఎక్కువగా పండిస్తారు. గత ఏడాది సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, నాసిరకం విత్తనాలు, రసాయన ఎరువుల, కల్తీ పురుగు మందుల వాడకం వల్ల పంట దిగుబడి ఎకరానికి 6 క్వింటాళ్ల నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చిందిని రైతులు చెబుతున్నారు.

మళ్లీ విత్తనాలు నాటాల్సిందే..



పది రోజుల క్రితం కురిసిన వర్షాలకు పత్తి విత్తనాలు నాటాను. సరిపోను వానలు పడకపోవడంతో విత్తనాలు మొలకెత్తలేదు. పదను తాకి కొన్ని మొలకెత్తినప్పటికీ, మొలకెత్తని విత్తనాల స్థానంలో మళ్లీ విత్తనాలు వేయక తప్పడం లేదు. ఆ విత్తనాలు వేయాలన్నా.. వాన పడాల్సిందే. అందుకే వాన కోసం ఎదురుచూస్తున్నాం.

- బాల్‌రాజ్, మల్లికార్జున్ పల్లి గ్రామం



మల్లేష్(ఫైల్) ప్రభాకర్(ఫైల్)

వేర్వేరు చోట్ల కరెంట్‌షాక్‌తో ఇద్దరు రైతులు మృతి

నర్సాపూర్/వెల్దుర్తి, జూన్ 18: వేర్వేరు చోట్ల కరెంట్ షాక్‌తో ఇద్దరు రైతులు మంగళవారం మృత్యువాత పడ్డారు. ఇందులో ఒకరు పొలం వద్ద స్టార్టర్‌కు కరెంట్ రావడం లేదని మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యారు. మరో చోట మోటర్‌కు కరెంట్ సరఫరా రాకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూస్తుండగా.. పై నుంచి 11కేవీ విద్యుత్ వైర్ తెగి పడి చనిపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్ మండలం రుస్తుంపేటకు చెందిన గుండం మల్లేష్(38) తనకున్న పది గుంటల భూమితో పాటు మరి కొంత భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. మంగళవారం తాను కౌలుకు తీసుకున్న పొలం వద్ద స్టార్టర్ డబ్బాకు కరెంట్ సరఫరా కావడం లేదని మరమ్మతులు చేస్తుండగా, ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లేష్‌కు భార్య జ్యోతి, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నాయి. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ పుష్పరాజ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ పెద్ద మరణించడంతో ఆ కుటుంబం దిక్కులేనిది అయిందని, కుటుంబాన్ని ఆదుకోవాలిని ఆత్మకమిటీ మాజీ చైర్మన్ శివకుమార్, ఎంపీటీసీ లక్ష్మీఅశోక్, మాజీ సర్పంచ్ విజయభాస్కర్‌రాజు తదితరులు కోరారు.

వెల్దుర్తి మండల పరిధి బండపోసన్‌పల్లికి చెందిన గుండు ప్రభాకర్(40) వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ రావడం లేదని, ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూస్తున్నాడు. ఒక్కసారిగా 11 కేవీ విద్యుత్ వైర్ తెగి ప్రభాకర్ మీద పడటంతో కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే చనిపోయాడు. తన భర్త విద్యుత్ షాక్‌తో మరణించాడని, ఎలాంటి అనుమానం లేదని ప్రభాకర్ భార్య గుండు శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



చింతల్‌చెర్వులో ప్రైవేటు క్లినిక్‌ను సీజ్ చేస్తున్న జిల్లా వైద్యాధికారి గాయత్రిదేవి

మరో ప్రైవేట్ క్లినిక్ సీజ్

హత్నూర, జూన్ 18: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మరో క్లినిక్‌ను జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి మంగళవారం సీజ్ చేశారు. మండలపరిధిలోని చింతల్‌చెర్వు గ్రామంలో అనుమతులు లేకుండా ఓ ఆర్‌ఎంపీ ఎనిమిది బెడ్లను ఏర్పాటు చేసి, చికిత్స చేస్తుండగా, జిల్లా వైద్యాధికారి తనిఖీ చేసి సదరు ఆర్‌ఎంపీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ క్లినిక్‌ను సీజ్ చేయడంతో పాటు దానిని అనుకుని ఏర్పాటు చేసిన మెడికల్ షాపులో పదో తరగతి చదివిన వ్యక్తిని ఉంచి మందులు విక్రయిస్తుండటంతో ఇదేమిటని ప్రశ్నించారు. ఈ విషయమై డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం ఇచ్చి తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి మాట్లాడుతూ జిల్లాలో ఆస్పత్రులు, క్లినిక్‌లు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ నేత్రావతి ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్

రేపు నులిపురుగుల నివారణ కార్యక్రమం

- జిల్లాలో 2,36,394 మంది గుర్తింపు
- డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీరామ్

మెదక్ అర్బన్, జూన్ 18: జిల్లాలో ఈనెల 20న నులిపురుగుల నివారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డా. శ్రీరామ్ తెలిపారు. జాతీయ నులిపురుగుణ నియంత్రణ, నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల పిల్లలు జిల్లాలో 2,36,394 మంది ఉన్నారని, వీరందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలన్నారు. అంగన్‌వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో అల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. ఏదైనా కారణంతో ఈనెల 20న మాత్రలు తీసుకోకుంటే ఈనెల 27న మరో అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ, ప్రోగ్రాం ఆఫీసర్లు డా.మాధురి విజయనిర్మల, అనిలా, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెరపైకి.. కొత్త ఠాణాలు

టూ టౌన్, మల్లన్నసాగర్‌లో ఏర్పాటుకు కసరత్తు

- గతంలో ప్రతిపాదనలు
- తాజాగా తెరపైకి అంశం
- మల్లన్నసాగర్ పునరావాస కాలనీ ఏర్పాటుతో పెరిగిన జనాభా
- ఊపందుకుంటున్న డిమాండ్



గజ్వేల్ పోలీస్‌స్టేషన్

గజ్వేల్, జూన్ 18: కొత్త పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు అంశం తాజాగా మరోసారి తెరపైకి వచ్చింది. గజ్వేల్‌లో టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌తో పాటు మల్లన్నసాగర్ ముంపు గ్రామాల కోసం ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ప్రతిపాదనలు మళ్లీ పట్టాలెక్కించాలనే డిమాండ్ వినిపిస్తున్నది. గత ప్రభుత్వ హయాంలో గజ్వేల్‌లో టూటౌన్‌తో పాటు పోలీస్ క్వార్టర్స్ కోసం అధికారులు స్థలాలను పరిశీలించడంతో పాటు ఈ మేరకు నివేదికను ఉన్నతాధికారులకు నివేదించారు. అప్పటి ప్రభుత్వం సదరు పోలీస్‌స్టేషన్ల అంశంపై దృష్టిసారించకపోవడంతో స్టేషన్ల ఏర్పాటు అంశం నీరుగారింది. తాజాగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు అంశంపై పలువురు నాయకులతో చర్చించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లడంతో మరోసారి పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు అంశం తెరపైకి వచ్చింది.

పోలీసులకు ఇబ్బందిగా మారిన గజ్వేల్

గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు 26 గ్రామాలుండగా, ఏడు మల్లన్నసాగర్ ముంపు గ్రామాలు, కొత్తగా బైపాస్, రైల్వేలైన్ అందుబాటులోకి రావడం ఇటు జనాభా, అటు పరిధి పెరిగి పోలీసులకు విధులు నిర్వహించడం కత్తి మీద సాములా మారింది. గజ్వేల్ రూరల్/టౌన్‌తో పాటు మల్లన్నసాగర్ ముంపు గ్రామాలకు ప్రత్యేకంగా పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తే సమస్యకు పరిష్కారం అవుతుందని అందరూ భావించారు. గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్‌ఐలకు ఇద్దరు, ఆరుగురు ఏఎస్‌ఐలకు గాను నలుగురు, ఆరుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 70మంది కానిస్టేబుళ్లకు గాను 40మంది మాత్రమే ఉన్నారు. వారిలో కూడా పలువురు డిప్యూటేషన్ ఇతర వింగ్‌లలో పని చేస్తుండటంతో కొందరు మాత్రమే పూర్తిస్థాయిలో విధులు నిర్వహిస్తున్నారు. 2020కి ముందు ఏడాదిలో 300 కేసులు నమోదయితే ప్రస్తుతం ఈ సంఖ్య 800 పెరిగింది. రోజువారీ ఫిర్యాదుల సంఖ్య గతంలో రెండు, మూడు ఉంటే ప్రస్తుతం ఈ సంఖ్య పది దాటింది. దీంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు.



గతంలోనే ప్రతిపాదనలు ..

జిల్లాల విభజన సమయంలో 2016లో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌తో పాటు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు ప్రతిపాదనలు పంపారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటైనా, రూరల్ పోలీస్‌స్టేషన్‌ను పట్టించుకోలేదు. 2021-22లోనే గజ్వేల్ రూరల్ స్టేషన్‌కు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఈ స్టేషన్లతో పాటు పోలీస్‌క్వార్టర్లు, ఇతరత్రా వినియోగాల నిమిత్తం పలు స్థలాలను పరిశీలించారు. ఈ ప్రతిపాదనలు అక్కడికే పరిమితమయ్యాయి.

పెరిగిన జనాభా.. ట్రాఫిక్

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో మల్లన్నసాగర్ ముంపు గ్రామాలైన తొగుట మండలంలోని రాంపూర్, లక్ష్మాపూర్, వేములఘాట్, బ్రాహ్మణబంజేరుపల్లి, పల్లెపహాడ్, ఏటిగడ్డ కిష్టాపూర్, కొండపాక మండలంలోని సింగారం, ఎర్రవల్లి గ్రామాలు వచ్చి చేరాయి. ఇక కొండపోచమ్మ సాగర్ ముంపు గ్రామాలైన బైలంపూర్, మామిడ్యాల, తానేదార్‌పల్లి గ్రామాల నుంచి అనేక మంది ప్రజలు కొండపోచమ్మ సాగర్ పునరావాస కాలనీకి వెళ్లకుండా పిల్లల చదువు, గజ్వేల్‌లో వ్యాపారం, ఉద్యోగాలు ఉన్న పలువురు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో గజ్వేల్‌లో జనాభా భారీగా పెరిగింది. గతంలో 40వేల జనాభా ఉండగా, ప్రస్తుతం ఈ సంఖ్య లక్షకు చేరింది. దీంతో పోలీసుశాఖ పునర్విభజన అనివార్యంగా మారిన నేపథ్యంలో గజ్వేల్ టూ టౌన్ పోలీస్‌స్టేషన్, ముంపు గ్రామాలకు ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ క్రమంగా బలపడుతున్నది.

పక్షపాత పోలీసులపై చర్యలు తీసుకోండి

● డీజీపీకి వీహెచ్‌పీ వినతి

హైదరాబాద్, జూన్18 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ సందర్భంగా పక్షపాత ధోరణితో వ్యవహరించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ, డీజీపీ రవిగుప్తాను కోరింది. సదరు పోలీసు అధికారులు పనిగట్టుకుని హిందువులపై అక్రమ కేసులు పెట్టారని ఫిర్యాదు చేసింది. ముఖ్యంగా మెదక్ పట్టణంలో పోలీసుల అలసత్వం కారణంగా అల్లర్లు జరిగాయని, అల్లర్లలో దోషులను వదిలిపెట్టి.. బాధితులను రిమాండ్ చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని వీహెచ్‌పీ విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, భజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు డీజీపీ రవిగుప్తాను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మెదక్‌లో ఆవుల విషయమై స్థానిక ఇన్‌స్పెక్టర్ కారణంగా కత్తిపోట్లు.. పెద్దఎత్తున అల్లర్లు జరిగాయన్నారు. చాదర్‌ఘాట్, ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసులు దోషులను వదిలిపెట్టి, వీహెచ్‌పీ, భజరంగదళ్ కార్యకర్తలను బెదిరిస్తున్నారని వారు డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఖమ్మం జిల్లాలో ఆవులను మితిమీరి ఒకే వాహనంలో ఎక్కించడం వల్ల, తొక్కిసలాటకు గురై 12 ఆవులు చనిపోయాయన్నారు.

ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

జహీరాబాద్, జూన్ 18: ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడని పట్టణ ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. అహ్మద్‌నగర్ కాలనీ సమీపంలోని చెట్ల పొదల్లో కానుగ చెట్టుకు 45 ఏళ్ల వయస్సున్న వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కిందికి దింపి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహం పూర్తిగా నల్లబడిపోయిందని, గుర్తు పట్టేందుకు వీలు లేకుండా ఉన్నదన్నారు. వ్యక్తికి సంబంధించిన వారెవరైనా ఉంటే 8712656763 నెంబరులో సంప్రదించాలన్నారు.

అనుమతులు లేని పాఠశాలలపై చర్యలకు డిమాండ్

నారాయణఖేడ్, జూన్ 18: అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర్య విద్యార్థి సమాఖ్య ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి తెంకటి కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఖేడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలో అనుమతులు లేని పాఠశాలలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయన్నారు. పాఠశాలల్లో సదుపాయాలు సక్రమంగా లేకపోయినా ఇరుకు భవనాల్లో ఏర్పాటు చేస్తూ విద్యార్థులకు నరకం చూపుతున్నారన్నారు. అనుమతిలేని పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోకపోతే.. ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు సురేందర్, మహేష్, వేణు పాల్గొన్నారు.

కూచనపల్లిలో వ్యక్తి దారుణ హత్య



హత్యకు గురైన నర్సయ్య, నర్సయ్య(ఫైల్)

హుస్నాబాద్‌రూరల్, జూన్ 18: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం కూచనపల్లి గ్రామంలో దారుణం చోటుచేసుకున్నది. గీకురు నర్సయ్య(55) అనే వ్యక్తి సోమవారం రాత్రి తన ఇంట్లో మంచంలో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు గొడ్డలితో నరికి చంపారు. అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో నిద్రలేచిన భార్య ఎల్లవ్వ ఈ విషయాన్ని పక్కింటి వాళ్లకు తెలిపింది. మంగళవారం ఉదయం హత్య సంఘటన విషయాన్ని గ్రామస్థులు పోలీసులకు తెలియజేశారు. ఎస్‌ఐ మహేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించారు. పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నర్సయ్య ఎవరితో గొడవపడే వాడుకాదని గ్రామస్థులు తెలిపారు. నర్సయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ కలహాల వల్లే ఈ హత్య జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందుకు సంబంధించి నర్సయ్య భార్య, ఇంకో వ్యక్తిని పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

హుస్నాబాద్‌రూరల్, జూన్ 18: అప్పులబాధతో ఓ వ్యక్తి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హుస్నాబాద్ పట్టణంలోని బుడగజంగాల కాలనీకి చెందిన చెన్నూరు సమ్మయ్య(35) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. సమ్మయ్యకు భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు వివాహానికి కొంత అప్పుచేశాడు. చిన్న కూతురు, కుమారుడికి రేచీకటి ఉండడంతో సమ్మయ్య నిత్యం తమ కుటుంబాన్ని తలుచుకుని దిగులు చెందేవాడు. రోడ్డు వెంట ఉన్న ఖాళీసీసాలు, ప్లాస్టిక్ కవర్లు ఏరుకుంటూ అమ్ముకుని వచ్చిన డబ్బుతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. అయితే పెద్ద కూతురు పెళ్లికి చేసిన అప్పులు ఎలా తీర్చాలని నిత్యం మదనపడేవాడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన సమ్మయ్య మంగళవారం ఉదయం కరీంనగర్ రోడ్డులో ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని బోరున విలపించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు నీటి సంప్‌లో పడి యువకుడి మృతి

జిన్నారం, జూన్ 18: ప్రమాదవశాత్తు నీటి సంప్‌లో పడి యువకుడు మంగళవారం మృతిచెందాడు. కౌడిపల్లి మండలం రాజ్‌పేటకు చెందిన శ్రీకాంత్(26) ఉపాధి నిమిత్తం గడ్డపోతారం వచ్చి పశువుల కాపరిగా పనిచేస్తున్నాడు. కాగా మంగళవారం ఉదయం పశువులను కాస్తుండగా వర్షాలకు నిండిన కుంటలో పడ్డాడు. గడ్డపోతారం శివారులో ఉన్న సంప్ వద్దకు వెళ్లి.. బురదను శుభ్రం చేసుకునే క్రమంలో ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో బొల్లారం పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి కేసు నమోదు చేశారు.

ఆహ్లాదం కరువు.. అభివృద్ధి బరువు

- అలంకారప్రాయంగా పార్కులు
- పిచ్చిమొక్కలు.. పొదలు
- వెంచర్లలోనూ కనిపించని పార్కులు


పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో గల పార్కులో ఎండిపోయిన చెట్లు, అధ్వానంగా మారిన పార్కు

జహీరాబాద్, జూన్ 18: సంగారెడ్డి జిల్లాలో జహీరాబాద్ పట్టణం అన్నిరంగాల్లో అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్నా.. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పార్కులు మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. నిధుల కొరత, పర్యవేక్షణాలోపం తదితర కారణాలు వెరసి పార్కుల అభివృద్ధిని మాత్రం పాలకులు, అధికారులు విస్మరిస్తున్నారు. అధికారుల రికార్డుల్లో మాత్రం పట్టణంలో సుమారు 58 పార్కులు ఉన్నట్లు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో వాటిని పరిశీలిస్తే వినియోగం ఏమేరకు ఉందో స్పష్టంగా అవగతమవుతుంది.

ముఖ్యంగా జహీరాబాద్ పట్టణం సుమారు 65 కిలో మీటర్ల మేరకు విస్తరించి ఉండడంతో పట్టణం చుట్టుపక్కల అనుమతులున్న వెంచర్లు కొన్నైతే.. మరికొన్ని తమ ఫైల్ డీటీసీపీ అధికారుల(హైదరాబాద్) వద్ద ఉందంటూ దర్జాగా నిర్మాణాలు చేస్తున్నారు. ప్రతీ వెంచర్ కోసం కేటాయించిన విస్తీర్ణంలో 10 శాతం పార్కులకు కేటాయించి, మిగతా స్థలంలో అభివృద్ధి చేయాలి. అధికారుల రికార్డుల్లో మాత్రం పార్కు స్థలం కనిపిస్తుంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులకు విరుద్ధంగా ఉంటాయి. అందులో కొన్ని పార్కులు కుచించుకుపోవడం, మరికొన్ని పార్కులు అభివృద్ధికి నోచుకోలేక అలంకార ప్రాయంగా తయారయ్యాయి. ఉన్న పార్కులకు తోడుగా కొత్త పార్కులు వినియోగంలోకి రాకపోవడంతో పట్టణంలో స్వచ్ఛమైన వాతావరణం కురువైందని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

అధికారుల లెక్కల ప్రకారం 58 పార్కులు

జహీరాబాద్ పట్టణ విస్తీర్ణాన్ని బట్టి సుమారు 100 పార్కులు ఉండాలి. అయితే అధికారుల లెక్కల ప్రకారం ప్రస్తుతం 58 పార్కులు 200 పైచిలుకు ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. అధికారికంగా ఉన్న 58 వెంచర్ల ప్రకారం 58 పార్కులు ఉండగా.. అనధికారంగా సుమారు 20కిపైగానే వెంచర్లు ఉన్నా.. అందులో పార్కులకు సంబంధించిన స్థలాన్ని ఏర్పాటు చేయలేకపోయారు. ఆయా పార్కుల స్థలాల్లో రాళ్లను ఏర్పాటు చేసి అమ్మకాలకు తెరలేపుతున్నారు. పట్టణంలో 37 వార్డులు ఉండగా ప్రతివార్డులో ఓపార్కు తప్పకుండా ఉండాలి. దీంతోపాటు అదనంగా ఏర్పాటవుతున్న వెంచర్లలో వెంచర్‌కో పార్కు చొప్పున ఏర్పాటు చేయాలి. ఉన్న పార్కుల్లో కొన్ని కుచించుకుపోగా.. మరికొన్ని వెంచర్లలో నిర్వాహకులు ప్లాట్లుగా ఏర్పాటు చేసి.. పార్కు స్థలాలను సైతం విక్రయించినట్లు ఆరోపణలున్నాయి. మున్సిపల్ అధికారులు దృష్టిపెట్టకపోవడంతోనే పట్టణంలోని పార్కులన్నీ అలంకార ప్రాయంగా మారుతున్నాయి.


వసంతవిహార్‌లో ఏర్పాటుచేసిన పార్కులో పిచ్చిమొక్కలు


పచ్చదనం లేక బోసిపోయిన ఆదర్శనగర్ పార్కు

మందుబాబులకు అడ్డాగా..

ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు మందుబాబులకు అడ్డాలుగా తయారయ్యాయి. ఆయా పార్కుల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు, వాచ్‌మెన్ ఏర్పాటు తదితరాలు ఉండాలి. ప్రస్తుతమైతే ఏ పార్కులోనూ అలాంటి సౌకర్యాలు లేవు. దీంతో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి పాములు, తదితర విష పురుగులు రావడంతో అందులోకి వెళ్లలేకపోతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కులను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

త్వరలో పార్కులన్నీ అభివృద్ధి చేస్తాం



మున్సిపాలిటీలో నిధులకొరత కారణంగా పార్కులను అభివృద్ధి చేయాలంటే ఇబ్బందిగా ఉంది. పట్టణంలో ఉన్న పార్కులన్నింటిని పరిశీలిస్తున్నం. పార్కులన్నింటిని ప్రజలకు వినియోగంలోకి వచ్చేలా చూస్తం. పట్టణంలో అక్కడక్కడ పార్కులు కబ్జాలకు గురవుతున్నట్లు తమ దృష్టికి వచ్చింది. వాటన్నింటిపై దృష్టిపెడుతున్నం. కబ్జాకుగురైతే వెంటనే స్వాధీనం చేసుకునేలా చర్యలకు ఉపక్రమిస్తం. ఇళ్ళ మధ్యలో పార్కులు ఉంటే చుట్టుపక్కల గల ప్రజలకు అహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తాయి. పార్కులను అభివృద్ధి చేసి కాపాడుకుందాం. పట్టణ ప్రజలు కూడ పార్కుల పరిరక్షణకు అధికారులకు సహకరించాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

'వసతులు లేని తెలంగాణ కాలనీ' కథనానికి స్పందన

- జిల్లా, మండల అధికారుల ఆదేశాలతో కాలనీలో పర్యటించిన ఈవో
- ఎక్స్‌కవేటర్‌తో పిచ్చిమొక్కల తొలగింపు


గడ్డపోతారం తెలంగాణ కాలనీలో ఎక్స్‌కవేటర్‌తో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న ఈవో వెంకట్, సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జిన్నారం, జూన్ 18: 'వసతులకు నోచుకోని తెలంగాణ కాలనీ' అని మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా, మండల పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించారు. డీపీవో, ఎంపీవో ఆదేశాల మేరకు గడ్డపోతారం ఈవో వెంకట్ తెలంగాణ కాలనీని సందర్శించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎక్స్‌కవేటర్‌తో నివాసాల మధ్య ఉన్న పిచ్చి మొక్కలు, అపరిశుభ్రతను తొలగించారు. రెండురోజుల్లో కాలనీవాసులతో సమావేశమై సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఈవో తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవులు పట్టివేత

- కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుల డిమాండ్


పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చిలప్‌చెడ్, జూన్ 18: అక్రమంగా తరలిస్తున్న ఆవులను పట్టుకుని రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షేక్ మహబూబ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. అర్ధరాత్రి సమయంలో సోమక్కపేట గ్రామం నుంచి (ఏపీ 29 యూ 6063) నెంబరు గల బొలెరో వాహనంలో మహ్మద్ అక్బర్, మన్నె దశరథ రెండు ఆవులను తరలిస్తూ పట్టుబడ్డారు. దీంతో వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఆవులను తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌హెచ్‌వోకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణగౌడ్, మాణిక్య గౌడ్ తదితరులు వినతిపత్రం అందజేసినవారిలో ఉన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ


దశాబ్ది అంతర్జాతీయ యోగా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, జూన్ 18: దశాబ్ది అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో వేడుకకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ మనుచౌదరి, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సిద్దిపేట ప్రభుత్వ బాలికల కళాశాల స్టేడియంలో ఈనెల 21న ఉదయం 5.30 గంటలకు యోగా దినోత్సవం జరుగుతుందని తెలిపారు. యోగా సంస్థలు, సేవా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అధికారులు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో అన్నివర్గాల వారు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్, భారత్ స్వాభిమాన్ ట్రస్టు, వ్యాస మహర్షి యోగా సొసైటీ ప్రతినిధులు తోట అశోక్, నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, తోట సతీష్, అయిత అంజయ్య, కల్లేపల్లి శ్రీనివాస్, తోట సంధ్య, హరిప్రసాద్, శశికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణ

సంగారెడ్డి అర్బన్, జూన్ 18: బీసీ స్టడీ సర్కిల్‌లో సివిల్ సర్వీసెస్ పరీక్ష(ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) 2025 కోసం ఉచిత లాంగ్‌టర్మ్ శిక్షణ ఇవ్వనున్నట్లు సంగారెడ్డి బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ టి.ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు ఆన్‌లైన్‌లో ఈ నెల 19వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షలకు మించరాదన్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి 100 మంది ప్రతిభావంతులను ఎంపిక చేసి వచ్చేనెల 7న అర్హత పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. శిక్షణ తరగతులు వచ్చేనెల 18వ తేదీ నుంచి 2025 ఏప్రిల్ 18వ తేదీవరకు హైదరాబాద్‌లోని సైదాబాద్ లక్ష్మీనగర్ కాలనీలోని బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహించబడతాయని తెలిపారు. వివరాలకు 08455-277105, 9949592991 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

వ్యాధుల కాలం.. జర పైలం

- పొంచి ఉన్న డెంగీ, మలేరియా ముప్పు
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న వైద్యులు




చిన్నకోడూరు, జూన్ 18: వేసవి కాలం నుంచి వర్షాకాలానికి సీజన్ మార్పు నేపథ్యంలో వాతావరణ మార్పుల కారణంగా చిన్న పిల్లలు, వృద్ధులకు పలు రకాల వ్యాధులు ప్రబలే ఆవకాశం ఉంది. దీంతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

వ్యాధికారకాలను నియంత్రించాలి

వర్షాకాలం, చలికాలం ఈ రెండు కాలాలు చిన్న పిల్లలకు, వృద్ధులకు గడ్డు కాలాలని వైద్యులు చెబుతున్నారు. వర్షాకాలం ఆరంభం కావడంతో వ్యాధుల విజృంభణకు ఆస్కారం ఉంది. ఫ్లూ విషయంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిలో ఫ్లూ దాడిచేస్తుంది. ముక్కు కారటం, జలుబు, దగ్గు, ప్రధాన లక్షణాలు. అదేవిధంగా వర్షాకాలంలో డెంగీ, మలేరియా వ్యాధులు వస్తుంటాయి. దీనికి ప్రధాన కారణం దోమలు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య మెరుగునకు చర్యలు చేపడితే సమస్యను అధిగమించే వీలుంటుందని నిపుణులు సూచిస్తున్నారు. గ్రామాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా పంచాయతీ సిబ్బంది నిత్యం పర్యవేక్షణ చేపట్టాలి.

పిల్లలకు, వృద్ధులకు వచ్చే వ్యాధులు

వైరల్ ఫీవర్స్, టైఫాయిడ్, డెంగీ, మలేరియా, వృద్ధులకు డయేరియా, వివిధ రకాల ఇన్‌ఫెక్షన్లు, తలనొప్పి, జ్వరం, ఒంటినొప్పులు వస్తాయి.

ప్రతి ఫ్రైడే డ్రై డేగా చేసుకోవాలి



సీజన్ మార్పు నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి. కూలర్లు, టైర్లలో, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ప్రతి ఫ్రైడే డ్రై డేగా చేసుకోవాలి. ఆరోగ్యపరంగా ఏమైనా సమస్యలుంటే ఆస్పత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ సరిత, పీహెచ్‌సీ వైద్యురాలు, చిన్నకోడూరు

ఆగి ఉన్న కారును ఢీకొట్టిన మరో కారు



ధ్వంసమైన కార్లు

చేగుంట, జూన్ 18: బైపాస్ వద్ద ఆగి ఉన్న కారును మరోకారు వెనకనుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు పిల్లలకు స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటన చేగుంట మండలం వడియారం బైపాస్ వద్ద మంగళవారం చోటు చేసుకున్నది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న కారు పంక్చర్ కావడంతో బైపాస్ పక్కన నిలిపారు. ఇంతలో హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న మరో కారు ఆగి ఉన్న కారును వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు పిల్లలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదానికి గురైన కార్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అనారోగ్యంతో నిప్పంటించుకుని వ్యక్తి ఆత్మహత్య


దశరథ్‌రెడ్డి (ఫైల్)

ఝరాసంగం, జూన్ 18: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని గుంతమర్పల్లి గ్రామశివారులో మంగళవారం చోటు చేసుకున్నది. ఏఎస్‌ఐ గంగయ్య వివరాల ప్రకారం.. మునిపల్లి మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన దశరథ్‌రెడ్డి(45) ఫైల్స్(అర్షమొలలు)తో బాధపడుతున్నాడు. ఈ నెల 17న ఇంటి నుంచి సైకిల్‌పై వెళ్లిన దశరథ్‌రెడ్డి తిరిగిరాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద గాలించినా ఆచూకీ లభించలేదు. దశరథ్‌రెడ్డికి ప్రతిరోజూ రామమందిరానికి దర్శనం కోసం వెళ్లే అలవాటు ఉన్నది. కాగా గుంతమర్పల్లి గ్రామశివారులో గల రామాలయం వద్దకెళ్లి.. పరిసర ప్రాంతాలను పరిశీలించగా కాలిపోయిన స్థితిలో దశరథ్‌రెడ్డి మృతదేహం కనిపించింది. స్థానికుల ద్వారా సమాచారమందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ వివరించారు.

ప్రమాదాల నివారణకు పరిశ్రమలు నిబంధనలు పాటించాలి

● సంగారెడ్డి ఆర్డీవో వసంతకుమారి



కార్యాలయంలో పరిశ్రమల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీవో

సంగారెడ్డి రూరల్, జూన్ 18: అభివృద్ధిలో భాగంగా పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగాల కల్పన ప్రాధాన్యమైనప్పటికీ ప్రమాదాలు నివారణకు పరిశ్రమల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఆర్డీవో వసంతకుమారి పేర్కొన్నారు. సంగారెడ్డిలోని ఆర్డీవో కార్యాలయంలో పరిశ్రమల ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలపై మాక్‌డ్రిల్‌తో కార్మికులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు ప్రతీ పరిశ్రమలో పటిష్టమైన యంత్రాంగం ఉండాలని, కాలుష్యం బారిన పడకుండా స్వచ్ఛమైన వాతావరణం ఉండేలా పరిశ్రమలు పనిచేయాలన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమ లేఔట్ దొరక్కపోవడంతో నివారణ చర్యలు చేపట్టడంలో ఆలస్యమవుతుందని, ప్రతీ పరిశ్రమ యాజమాన్యం ఆయా పరిశ్రమల్లో ప్రమాదకరమైన రసాయనాలు, బాయిలర్లు పరిశ్రమ నడిచే విధానం, లేఅవుట్, పరిశ్రమ బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ లక్ష్మి, వివిధ పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కాజీపల్లిలో కాలుష్యంపై అవగాహన ర్యాలీ



పరిశ్రమల కాలుష్యంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

జిన్నారం, జూన్ 18: కాజీపల్లి పారిశ్రామిక కాలుష్యంపై స్థానికులకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. మంగళవారం కాజీపల్లిలో న్యాయవాది బండి రమాకాంత్ ఆధ్వర్యంలో కాలుష్య వ్యతిరేక పోరాట కమిటీ తరఫున అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పరిశ్రమల జల, వాయు కాలుష్యంపై ప్రజాపోరాటంలో భాగంగా ఈ నెల 23న జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు రమాకాంత్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో అతిథి ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

చిన్నశంకరంపేట, జూన్ 18: మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో బోధించడానికి అతిథి ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శ్రీదేవి మంగళవారం ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి తెలుగు, హిందీ, గణితము సబ్జెక్టులు బోధించడానికి అర్హతగల అభ్యర్థులు ఈ నెల 19వ తేదీ సాయంత్రం వరకు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

నేడు తెలంగాణ ఉద్యమకారుల సమావేశం

సంగారెడ్డి రూరల్, జూన్ 18 : తెలంగాణ ఉద్యమకారుల సమావేశం ఈ నెల 19న సంగారెడ్డిలోని జడ్పీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు తెలంగాణ జనసమితి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ హాజరుకానున్నారని, తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమకారులు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని ఆమె కోరారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

పెద్దశంకరంపేట, జూన్ 18: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని పరిరక్షించుకోవాలని జిల్లా మానిటరింగ్ అధికారి సతీష్‌కుమార్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెద్దశంకరంపేటలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో నోడల్‌అధికారి వెంకటేశం, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది రవి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

● **చేగుంట:** మండల పరిధిలోని పలు పాఠశాలల్లో మంగళవారం బడి బాట కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. మండలంలోని వల్లభాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హరితహారం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి భూమేష్ , అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పోచమ్మల శ్యామల, ఉపాధ్యాయులు సమత, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదబీమా చెక్కు పంపిణీ

కల్హేర్, జూన్ 18: మండల పరిధిలోని మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన సొన్నాయిల సామెల్ అనే బీఆర్ఎస్ కార్యకర్త రోడ్డు ప్రమాదంలో మరణించగా, అతడి కుటుంబానికి రూ.2లక్షల ప్రమాదబీమా మంజూరైంది. ఈ మేరకు మంగళవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మృతుడి భార్య పోచవ్వకు చెక్కును అందజేశారు.

గ్రామాల సమస్యలు ప్రత్యేక అధికారులే గుర్తించాలి

● రేగోడ్ మండల సర్వసభ్య సమావేశంలో జడ్పీటీసీ యాదగిరి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ, ఎంపీపీ

రేగోడు జూన్ 18: గ్రామాల్లో సమస్యలను ప్రత్యేక అధికారులు గుర్తించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచించాలని రేగోడు జడ్పీటీసీ యాదగిరి పేర్కొన్నారు. మంగళవారం రేగోడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సరోజన అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ.. గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం ముగిసినందున ప్రత్యేక అధికారుల పాలన ఉందని, అందువల్ల గ్రామాల్లో తిరుగుతూ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని అధికారులు వెంటనే పరిష్కరించాలని జడ్పీటీసీ యాదగిరి సూచించారు. చెరువులు, కుంటల్లోని నీరు వృథా పోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, చెరువుల్లో చేపల కోసం నీటిని వృథాగా వదిలేసేవారిపై చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ అధికారి హెచ్చరించారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, మందులు కూడా అందుబాటులో ఉన్నాయని రేగోడు ప్రాథమిక ఆరోగ్య అధికారి సిద్ధప్ప తెలిపారు. మర్పల్లి అంగన్‌వాడీ భవన నిర్మాణం పూర్తయినా వినియోగంలోకి రావడం లేదని తెలుపగా రెండు రోజుల్లో పోలీస్ సిబ్బందితో వెళ్లి స్వాధీనం చేసుకుంటామని ఎంపీడీవో పేర్కొన్నారు. సొసైటీ ద్వారా విత్తనాలు, ఎరువులు తెప్పించాలని సభ్యులు వ్యవసాయ అధికారికి సూచించారు. ఉపాధి హామీలో అమలు చేస్తున్న పథకాలను రైతులకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వినీల, ఎంపీటీసీలు నాగిరెడ్డి, నర్సింహులు, కోఆప్షన్ చోటు మియా, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ విజయభాస్కర్, ఎంపీడీవో సీతారావమ్మ, వ్యవసాయాధికారి జావిద్, సీహెచ్‌వో సిద్ధప్ప, ఏపీవో జగన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి, ఏఈలు రవి, రమేష్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలను మండలపరిషత్, ఉపాధి అధికారులు సన్మానించారు.

ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాప్రతినిధులకు సన్మానం



జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎంపీడీవో, అధికారులు

మునిపల్లి, జూన్ 18: జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం జూలై 3వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో మంగళవారం మునిపల్లి ఎంపీడీవో సమావేశ మందిరంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీడీవో డాక్టర్ హరినందన్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పైతర మీనాక్షి సాయికుమార్, ఎంపీపీ గౌడిగామ శైలజ శివశంకర్ మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాటు ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించారని, అభివృద్ధికి అధికారులు సహకరించారని గుర్తు చేశారు. అంతకు ముందుకు జడ్పీటీసీ మీనాక్షి, ఎంపీపీ శైలజతోపాటు ఎంపీటీసీలు పాండు, రాజశేఖర్, విజయ, రేణుక, లక్ష్మి, స్వప్నలను అధికారులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ పర్యవేక్షకుడు రామలింగం, ఎంపీవో నాగలక్ష్మి, సీస రాజేశ్వర్‌రావు, జుస శ్రీనివాస్, టైపిస్ట్ విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి మంత్రుల రాక



మంత్రుల పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

కొల్చారం, జూన్ 18: కొల్చారం మండలంలో బుధవారం పలు అభివృద్ధి పనులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, జిల్లామంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లేశంగౌడ్ తెలిపారు. కార్యక్రమాల్లో భాగంగా కొల్చారంలో జరిగే బడిబాట ర్యాలీలో పాల్గొంటారని, రూ.కోటి వ్యయంలో నిర్మించిన మండల పరిషత్ కార్యాలయ నూతన భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. పోతంశెట్‌పల్లి గ్రామానికి మంజూరైన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని, అలాగే కొల్చారం మండలంలో పలు గ్రామాలకు చెందిన 40 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, రాష్ట్ర నాయకులు సోమన్నగారి రవీందర్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలోని ఎంపీపీ జడ్పీటిసితో పాటు అన్ని గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు హాజరు కావాలని కోరారు.

ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

కొల్చారం జిల్లాపరిషత్ హైస్కూల్ ఆవరణలో మంత్రుల పర్యటనకు ఏర్పాట్లను జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మంగళవారం పరిశీలించారు. ఆయన వెంట నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ మహ్మద్ గఫార్ మియా, ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు, ఎంఈవో నీలకంఠం, ఏపీవో మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన



జహీరాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వెంకటాపూర్ రైతులు

జహీరాబాద్, జూన్ 18: కోహీర్ మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతులు పరిహారం కోసం మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కోహీర్ మండలంలోని వెంకటాపూర్, కొత్తూర్(డి) గ్రామానికి చెందిన సుమారు 750 పైచిలుకు ఎకరాల వ్యవసాయభూములు ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్‌కోసం గత ప్రభుత్వం కేటాయించింది. ఇందులో మొదటి విడతగా 100మంది రైతులకు పరిహారాన్ని ఇచ్చేందుకు అధికారులు నిర్ణయించారు. 100 మందిలో కూడా కొందరికి మాత్రమే ఇచ్చారని, మిగతావారికి ఇవ్వకపోవడంతో ఆర్డీవో కార్యాలయం చుట్టూ తిరిగి ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పాసుపుస్తకాలకు, సర్వే రికార్డులకు, క్షేత్రస్థాయికి పొంతన లేని విధంగా అధికారులు పరిహారాన్ని చెల్లించడంతో తమకు అన్యాయం జరుగుతుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. పాసు పుస్తకాల్లో ఉన్న భూమిని తగ్గించి చూపుతూ పరిహారం ఇవ్వడాన్ని రైతులు తప్పుబట్టారు. ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్‌కోసం కేటాయించిన భూముల్లో ఒక్కో రైతు పరిస్థితి ఒక్కోరకంగా ఉందని, తగ్గించి ఇవ్వడంతో తమకు నష్టం జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. న్యాయం కల్పించాలని కోరుతూ తాము వారానికి రెండురోజుల చొప్పున ఆర్డీవో కార్యాలయానికి తిరగాల్సివస్తున్నదని వివరించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాసు పుస్తకంలో ఉన్న మొత్తం వ్యవసాయభూమికి పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నీట్ మళ్లీ నిర్వహించాలి: పీడీఎస్‌యూ



సంగారెడ్డిలోని ఐబీ వద్ద పీడీఎస్‌యూ నాయకుల నిరసన



సంగారెడ్డిలో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 18 : నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం.సురేశ్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్షపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో లోతుగా విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సంగారెడ్డిలోని ఐబీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ.. నీట్ పరీక్ష ఈ సారి పలు అనుమానాలకు తావిచ్చిందన్నారు. పరీక్ష నిర్వహణలో విఫలమైన ఎన్‌టీఏపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నీట్ పరీక్షపై ఓ నిర్ణయం తీసుకోవాలని లేకపోతే ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్, నాయకులు అర్జున్, శివ, సిదార్థ్, స్వామి, ఆకాశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

లీక్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి: ఎస్ఎఫ్ఐ

సంగారెడ్డి రూరల్, జూన్ 18: నీట్ పరీక్ష పేపర్లను లీక్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజేష్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్ష లీకేజీపై కేంద్రం స్పందించకుండా ఎవరైతే గ్రేస్ మార్కులు తెచ్చుకున్నారో వారి స్కోర్ కార్డులు రద్దు చేసి తిరిగి రీ ఎగ్జామ్ నిర్వహించడమంటే నీట్ అవకతవకలను పక్కదారి పట్టించడమేనని ఆరోపించారు. పేపర్ లీక్‌పై వెంటనే సుప్రీం కోర్టు నేతృత్వంలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ వాణి, రవి, కిరణ్‌సాయి, మనోజ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

'మున్సిపాలిటీలో అధికారుల ఏకపక్ష నిర్ణయాలు సరికాదు

జహీరాబాద్, జూన్ 18:జహీరాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కొందరు అధికారులు ఏకపక్షనిర్ణయాలు తీసుకోవడంతో కాంట్రాక్టర్లకు అన్యాయం జరుగుతుందని మాజీ కౌన్సిలర్, సివిల్‌కాంట్రాక్టర్ అమనుల్లా గోరీ ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఎలక్ట్రిక్ పనులకు సంబంధించిన టెండర్లను ఓపెన్ చేయడంలో మున్సిపల్ అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై తిరిగి పనులను అప్పగించడాన్ని ఆయన తప్పుపట్టారు. 25సంవత్సరాల కాలంగా ఒకే కాంట్రాక్టర్‌కు ఎలక్ట్రిక్ పనులను అప్పగించడమేంటని ఆయన ప్రశ్నించారు. మున్సిపల్ అధికారులు ఏకపక్షనిర్ణయాలు తీసుకుంటూ, నిబంధనలకు పాతరేసి పాత కాంట్రాక్టర్‌కే పనులను దక్కేలా చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మున్సిపాలిటీలో ఎలక్ట్రిక్‌పనులకు సంబంధించిన టెండర్‌ను రద్దుచేసి మళ్లీ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. అయితే ఇటీవల ఎలక్ట్రికల్ టెండర్‌కు సంబంధించి 90రోజుల గడువు ఉండగా 180 రోజులకు టెండర్‌ను ఓపెన్‌చేయడాన్ని చూస్తుంటే మున్సిపల్ అధికారులు సదరు కాంట్రాక్టర్‌కు వత్తాసు పలుకుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు దృష్టికి తీసుళ్లి, అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని ఆయన స్పష్టం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలి : మెదక్ ఎంపీ

కౌడిపల్లి, జూన్ 18: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. మంగళవారం ఎంపీ హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో మండల కేంద్రంలోని ఆర్గానిక్ టీ పాయింట్ వద్ద స్థానిక బీజేపీ కార్యకర్తలతో కలిసి టీ తాగుతూ మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఆయన వెంట రాష్ట్ర బీజేపీ నాయకుడు మురళీధర్ యాదవ్, జిల్లా బీజేపీ నాయకులు ఖాజీపేట రాజేందర్, రాకేష్, కృష్ణ, విష్ణు, అశోక్, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

మున్సిపాలిటీ దుకాణాలకు వేలం నిర్వహించాలి

మెదక్, జూన్ 18: మెదక్ మున్సిపాలిటీకి చెందిన 17 దుకాణాలకు బహిరంగ వేలంపాట నిర్వహించాలని ఎంఎస్ఎఫ్ కన్వీనర్ బాలరాజు పేర్కొన్నారు. మంగళవారం జస్టిస్‌లోకా యుక్త కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది ఫిబ్రవరి 23న నిర్వహిస్తామన్న వేలంపాట వాయిదా వేసి ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించారని వివరించారు. అయితే ఏడాది కాలంపాటు జాప్యానికి కారణాలు తెలుపలేదని, దీంతో దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. గతంలో షాపులు పొందిన వ్యక్తులకు అవకాశం కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ప్రభాకర్ ఉన్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్



సంధ్యారాణి

సంగారెడ్డి అర్బన్, జూన్ 18: సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకురాలు బి.సంధ్యారాణికి డాక్టరేట్ వరించింది. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ ఆంగ్లశాఖ ఆచార్యులు డా.కొండె నాగేశ్వర్‌రావు పర్యవేక్షణలో 'ఎన్‌హ్యాన్సింగ్ కమ్యూనికేషన్ స్కిల్స్ ఆఫ్ పాలిటెక్నిక్ స్టూడెంట్స్, ఎ స్టడీ ఆఫ్ సెలెక్టెడ్ పాలిటెక్నిక్ కాలేజెస్' అనే అంశంపై పరిశోధన చేసినందుకుగాను ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.అరుణబాయి, ఇతర అధ్యాపకులు ఆమెను అభినందించారు.

సంగారెడ్డి జీజీహెచ్‌లో సదరం క్యాంపు

సంగారెడ్డి అర్బన్, జూన్ 18: సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం సదరం క్యాంపును సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మీ సేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకున్న దివ్యాంగులు క్యాంపునకు తరలివచ్చారు. వారికి ఆస్పత్రి డాక్టర్లు పరిశీలించి వైకల్యాన్ని ధ్రువీకరించారు.

జీజేసీలో అడ్మిషన్లు ప్రారంభం

మునిపల్లి, జూన్ 18: మండలంలోని బుదేరా చౌరస్తా సమీపంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు మంగళవారం నాడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఇంటర్ ఫస్టియర్‌లో చేరేందుకు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ ఇంగ్లిష్ మీడియం, సీఈసీ తెలుగు మీడియంలలో ఇటీవల ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇంటర్నెట్ పదో తరగతి మెమో, ఆధార్‌కార్డు జిరాక్స్, రెండు ఫొటోలు, టీసీ, బోనఫైడ్ సర్టిఫికెట్లను తీసుకొని కళాశాలలో అడ్మిషన్ పొందవచ్చని సూచించారు.

భవానీ మాతను దర్శించుకున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్, జూన్ 18: ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సతీమణి అనుపమ రెడ్డితో కలిసి మంగళవారం మహారాష్ట్రలోని తుల్జాపూర్ భవానీమాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారాయణఖేడ్ ఎంపీపీ చాందిబాయిరాంచందర్‌చౌహాన్, సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ చౌహాన్, కుటుంబ సభ్యులు, నాయకులు పూజల్లో పాల్గొన్నారు.

ఘనంగా దత్తాత్రేయ మందిర వార్షికోత్సవం

నారాయణఖేడ్, జూన్ 18:ఖేడ్‌లోని దత్తాత్రేయ మందిర ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అభిషేకం, హోమం, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవాల్లో బర్దీపూహర్ ఆశ్రమ పీఠాధిపతి అవధూతగిరి మహరాజ్, డాక్టర్ సిద్దేశ్వర్ మహరాజ్, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమహరాజ్‌లు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. కార్యక్రమాల్లో జహీరాబాద్‌ఎంపీ సురేష్ షెట్కార్, ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కెనాల్ కోసం భూసేకరణపై రైతులతో సమావేశాలు

నర్సాపూర్, జూన్ 18: నర్సాపూర్ డివిజన్ పరిధిలో సంగారెడ్డి కెనాల్-2 నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు రైతులతో ఈ నెల 20వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మనోహరాబాద్ నుంచి నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి వరకు మొత్తం 73 కిలోమీటర్ల మేర కాలువ కోసం భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. ఈ నెల 20న పెద్దచింతకుంట, రెడ్డిపల్లి రైతులతో, 21న బ్రాహ్మణపల్లి, చెన్నాపూర్, 22న చిన్నచింతకుంట, చిప్పల్‌తుర్తి, 24న పెద్దగొట్టిముక్ల రైతులతో సమావేశం ఉంటుందన్నారు.

రంగంపేట సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాసానికి విఫలయత్నం

కొల్చారం, జూన్ 18: మండలంలోని రంగంపేట సొసైటీ చైర్మన్ అరిగె రమేష్‌కుమార్(బీఆర్ఎస్)పై అవిశ్వాసానికి సంబంధించి సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం పదకొండు గంటల వరకు హైడ్రామా సాగింది. ఈ విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే సునితారెడ్డి ఆదేశాలతో మండల పార్టీ అధ్యక్షుడు గౌరీశంకర్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డిల నేతృత్వంలో పార్టీశ్రేణులు అప్రమత్తం కావడంతో ప్రయత్నాలు విఫలమయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. రంగంపేట సొసైటీ పాలకవర్గంలో మొత్తం పదమూడు మంది డైరెక్టర్‌లు ఉండగా, చైర్మన్ అరిగె రమేష్, వైస్‌చైర్మన్ మోత్కు మల్లేశంతో పాటు పదకొండు మంది డైరెక్టర్‌లు ఉన్నారు. అవిశ్వాసానికి తొమ్మిది మంది డైరెక్టర్‌లు అవసరం ఉండగా, సోమవారం తొమ్మిది మంది డైరెక్టర్లకు ఏడుపాయల్లో ఓ గెస్ట్‌హౌస్‌లో విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో ఆరుగురు బీఆర్ఎస్, ముగ్గురు కాంగ్రెస్ డైరెక్టర్లు ఉన్నారు. మంగళవారం ఉదయం పదకొండు గంటలకు డీసీవోను కలిసి అవిశ్వాసానికి నోటీసు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. ఈ విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆదేశాలతో సీన్ మొత్తం మారింది. మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఉదయం సంగాయిపేట గ్రామానికి చెందిన డైరెక్టర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, పైతర గ్రామానికి చెందిన యువత నాయకులు రవితేజరెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గౌరీశంకర్ రంగంలోకి దిగి ఏడుపాయల గెస్ట్‌హౌస్‌కు వెళ్లి నలుగురు డైరెక్టర్‌లను అక్కడి నుంచి తప్పించారు. దీంతో అయిదుగురు డైరెక్టర్లు మాత్రమే మిగిలిపోవడంతో అవిశ్వాసానికి నోటీసు ఇచ్చే యత్నం విఫలమైంది.

ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ చోరీ

జిన్నారం, జూన్ 18: గడ్డపోతారంలో ఇంటి ముందు నిలిపి ఉంచిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. సోమవారం రాత్రి సునీల్ అనే వ్యక్తి తన ఇంటి ముందు స్ప్లెండర్ బైక్‌ను పార్కు చేసి ఉంచగా.. గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఇటీవల 15రోజులుగా గడ్డపోతారంలోని పలు వాహనాల బ్యాటరీలను కూడా దొంగలు అపహరిస్తున్నారని స్థానికులు తెలిపారు.

శిఖం భూమి కబ్జాపై అధికారుల విచారణ



శిఖం భూమిని పరిశీలిస్తున్న నీటిపారుదల శాఖ అధికారులు

హత్నూర, జూన్ 18: మండలంలోని బ్రాహ్మణగూడ గ్రామ శివారు చెరువు, కుంటల శిఖం భూమి కబ్జాపై నీటి పారుదల శాఖ ఏఈ వైష్ణవి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బ్రాహ్మణగూడ గ్రామ శివారులోని అయ్యగారి చెరువు, గునుకుంట, నక్కలకుంటతో పాటు హత్నూర గ్రామానికి చెందిన తాళిమి చెరువు శిఖం భూమిని గ్రామానికి చెందిన కొంత మంది కబ్జా చేసి సాగు చేస్తున్నట్టు గ్రామస్థుల ద్వారా సమాచారం అందడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించాన్నారు. కబ్జా చేసిన వారిపై కేసులు నమోదు చేసేందుకు హత్నూర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు సైతం చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఈ డిప్యూటీ రవికుమార్‌తో పాటు స్థానికులు ఉన్నారు.

సాగులో మెళకువలతో అధిక దిగుబడులు సాధించాలి

కొల్చారం, జూన్ 18: వానకాలం పంటల సాగులో మెళకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి గోవిందు సూచించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతీ మంగళవారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి గోవిందు హాజరై శాస్త్రవేత్తల సూచనలు తెలుసుకున్నారు. అలాగే సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో ఏడీఏ పుణ్యవతి, మండల వ్యవసాయాధికారి శ్వేతకుమారి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు: ఏడీఏ

కంగ్టి, జూన్ 18: ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ సహాయ సంచాలకుడు నూతన్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం కంగ్టిలో పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, స్టాకు వివరాలు పరిశీలించారు. ఏడీఏ వెంట ఏవో ప్రవీణ్‌చారి, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య: ఎంఈవో



గుండ్లమాచునూర్ పాఠశాలలో మొక్క నాటుతున్న ఎంఈవో

హత్నూర, జూన్ 18: ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని ఎంఈవో వెంకట నర్సింహులు పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం గుండ్లమాచునూర్, బొక్కలగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు పంపిణీ చేయడంతో పాటు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి వెంకట నర్సింహులు మాట్లాడుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌వీఎం సీఎంవో వెంకటేశం, పీఆర్ ఏఈ అరవింద్, ఏపీవో ప్రవీణ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్, షహనాబేగం, గ్రామ కార్యదర్శి రమణారెడ్డి, గ్రామ పంచాయతీ మాజీ కోఆప్షన్ సభ్యుడు శ్రీహరి, ఎన్ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్‌కుమార్ ఉన్నారు.

● జిన్నారం, జూన్ 18: ప్రభుత్వ పాఠశాల విద్యను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి పేర్కొన్నారు. మంగళవారం బొల్లారం మున్సిపాలిటీలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి, హెచ్‌ఎం మంగీలాల్ నోటుబుక్స్ పంపిణీ చేశారు.

● కొల్చారం, జూన్ 18: మండల పరిధిలోని రాంపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈవో నీలకంఠం మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. మిగిలిన పాఠ్యపుస్తకాలను, యూనిఫారాలను విద్యార్థులకు పంపిణీ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం కొల్చారంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి బడిబాటలో భాగంగా విద్యార్థులచే కలిసి మొక్కలను నాటారు.

షెట్కార్‌ను సన్మానించిన గొల్ల కురుమలు



ఎంపీని సన్మానిస్తున్న గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం నాయకులు

నారాయణఖేడ్, జూన్ 18: జహీరాబాద్ ఎంపీగా ఎన్నికైన సురేష్ షెట్కార్‌ను మంగళవారం ఖేడ్‌లోని ఆయన నివాసంలో పెద్దసంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల బాధ్యులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. గొర్రెలు, మేకల పెంపకం దారులసంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపుమల్‌శెట్టి, జిల్లా, డివిజన్ బాధ్యులు ప్రసాద్, ఓంప్రకాష్, నరేష్‌యాదవ్, పెద్ద సాయిలు ఎంపీని గొంగడితో సన్మానించారు.

సాదాసీదాగా తూప్రాన్ మండల సర్వసభ్య సమావేశం

తూప్రాన్, జూన్ 18: తూప్రాన్ మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. మంగళవారం నిర్వహించిన మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గడ్డి స్వప్న వెంకటేశ్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో అధికారులు నివేదికలు చదవడంతోనే సరిపెట్టారు. ఎలాంటి చర్చలు, తీర్మానాలు లేకుండానే సమావేశం ముగిసింది. సమావేశానికి పలుశాఖల అధికారులు గైర్హాజర్ కావడంతో ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలానికి మూడు పల్లె దవఖానాలు మంజూరైనట్లు పంచాయతీరాజ్ ఏఈ మధు పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్ ఎంపీపీ శరణ్యబాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు పంజాల వెంకటమ్మ, గంగుమల్ల సంతోష్‌రెడ్డి, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.